

మౌన మర్మం!



- చారి రూటు ఎటు?
- నోరు విప్పని సత్యనారాయణ గౌడ్
- బీఆర్ఎస్‌లో తొలగని అయోమయం
- ఈ ఇద్దరు నేతలతో కాంగ్రెస్ పార్టీ సంప్రదింపులు
- అదేబాటలో బీజేపీ సైతం..

నిర్మల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు అగ్రనేతలు గత కొంతకాలం నుంచి మౌనంగా ఉంటూ మారుతున్న పరిణామాలపై నోరు మెదపకపోవడం జిల్లాలో చర్చనీయాంశమవుతోంది. ఈ ఇద్దరిలో ఒకరు మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి కాగా మరొకరు ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ శోభారాణి భర్త, సీనియర్ నాయకులు సత్యనారాయణగౌడ్‌లు కావడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. తెలుగుదేశం పార్టీని వీడినప్పటి నుంచి వీరిద్దరు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతూ సీనియర్ నేతలుగా గుర్తింపు పొందారు. వేణుగోపాల చారి ముథోల్ ఎమ్మెల్యేగా, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వం అధికార ప్రతినిధిగా, ఐడీసీ ఛైర్మన్‌గా కొనసాగారు. అంతకు ముందు టీడీపీ హయాంలో ఆయన రాష్ట్రమంత్రిగా, కేంద్రమంత్రిగా కూడా కొనసాగిన సంగతి తెలిసిందే. కాగా సత్యనారాయణగౌడ్ మాజీ సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితునిగా ముద్రపడడమే కాకుండా బీఆర్ఎస్ పార్టీలో ముఖ్య నేతగా కొనసాగుతున్నారు. అయితే గత కొద్దిరోజులుగా జిల్లాలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో వీరిద్దరు ఇప్పటి వరకు తమ స్పందన వెలిబుచ్చకుండా సైలెంట్‌గా వ్యవహరిస్తుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. మాజీ సీఎం కేసీఆర్‌తో సమకాలికుడిగా కొనసాగిన వేణుగోపాల చారి ఆయనతో కలిసి తెలుగుదేశం పార్టీలోనూ పనిచేశారు. తదనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరిన వేణుగోపాలచారి ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా సాగినప్పటికి అధిష్టానం ఆయనకు పెద్దగా ప్రాధాన్యతనివ్వలేదన్న వాదనలున్నాయి. అలాగే సత్యనారాయణ గౌడ్ విషయంలో కూడా అధిష్టానం పెద్దగా ప్రాధాన్యత కల్పించకపోవమే కాకుండా పలుసార్లు అప్పటి సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు ఆయన ప్రయత్నించినప్పటికీ అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదన్న ప్రచారం ఉంది. దీని కారణంగా చాలా రోజుల నుంచి అటు వేణుగోపాలచారి ఇటు సత్యనారాయణగౌడ్‌లు సీఎం కేసీఆర్ తీరుపైనే కాకుండా పార్టీ రాష్ట్రస్థాయి నేతలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు. దీనికి తోడు జిల్లాకు చెందిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వైఖరిపై కూడా వీరిద్దరు మొదటి నుంచి అసంతృప్తిగానే ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి చెందిన చాలా మంది సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులంతా వరుస కట్టి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. జిల్లాకు చెందిన ముఖ్యనేతలంతా క్యూ కట్టి బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నప్పటికి మొదటి నుంచి అధిష్టానం వైఖరిపై అసంతృప్తితో ఉన్న వేణుగోపాలచారి, సత్యనారాయణగౌడ్‌లు మాత్రం ఇప్పటి వరకు తమ అంతరంగాన్ని బయటకు వెల్లడించకపోతుండడం ఆసక్తికరంగా మారుతుంది. అయితే వీరిద్దరు కూడా కొద్దిరోజుల్లోనే పార్టీని వీడే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. కాగా ఏ పార్టీలో చేరుతారోనన్న అంశమే అంతటా చర్చకు తావిస్తోంది. ముఖ్యంగా సత్యనారాయణగౌడ్‌కు జిల్లాలో ప్రత్యేక అనుచరగణం ఉండడమే కాకుండా మూడు మండలాల్లో గట్టిపట్టున్న నాయకుడిగా మంచి గుర్తింపు ఉంది. ప్రతి ఎన్నికల్లో ఆయన పార్టీ అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపుతుంటారని ముఖ్యంగా బీసీ వర్గ నేతగా ఆయనకు జిల్లాలో ఆదరణ ఉందని చెబుతున్నారు. కాగా రాజకీయ వ్యూహరచనలో దిట్టగా పేరున్న వేణుగోపాలచారికి సైతం ఇప్పటికి జిల్లాలో కొంతమేరకు అనుచరులున్నారు. అలాగే ఆయనకు జిల్లా రాజకీయాల్లో ప్రభావం చూపే నేతగా బలమైన గుర్తింపు ఉంది. ఇటీవల రాష్ట్రస్థాయిలోనూ, జిల్లాస్థాయిలోనూ జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమీక్ష సమావేశాలకు వీరిద్దరు హాజరుకాకుండా దూరంగా ఉంటుండడం, దీనికి తోడు ఇటీవల రైతుల సమస్యలపై పార్టీ చేపట్టిన ధర్నాలకు కూడా హాజరుకాకపోవడం లాంటి పరిణామాలు వీరు పార్టీ మారే అంశంపై రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. కాగా వీరిద్దరి వైఖరి ప్రస్తుతం అటు బీఆర్ఎస్ పార్టీలో ఇటు కాంగ్రెస్, బీజేపీలలో కొత్త చర్చకు తావిస్తోంది.

● ఈ ఇద్దరు నేతలతో కాంగ్రెస్ పార్టీ సంప్రదింపులు

కాగా వేణుగోపాలచారి, సత్యనారాయణగౌడ్ బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతూ ఇప్పటి వరకు క్రియాశీలకంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకపోతుండడం అలాగే అధిష్టానంపై అసంతృప్తితో ఉండడం లాంటి అంశాలను పసిగట్టిన కాంగ్రెస్ పార్టీ వీరిద్దరిని తమ పార్టీలోకి రప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తుందంటున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీహరిరావుతో పాటు ఇన్‌చార్జీ మంత్రి సీతక్కతో పాటు మరికొంత మంది సీనియర్ నాయకులు ఈ ఇద్దరు నేతలను కాంగ్రెస్‌లోకి రావాల్సిందిగా ఇప్పటికే ఆహ్వానించినట్లు సమాచారం. దీని కోసం గానూ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంప్రదింపులు సైతం కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తుండగా సీనియర్ నాయకులంతా కాంగ్రెస్ పార్టీలో చేరిన కారణంగా వీరిద్దరిని కూడా పార్టీలోకి రప్పించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అంటున్నారు. అయితే ఈ ఇద్దరు నేతలు మాత్రం ఇప్పటి వరకు తమ అంతరంగాన్ని బయట పెట్టకుండా జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తూ తమ భవిష్యత్ కార్యచరణను రూపొందించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా సత్యనారాయణగౌడ్ ఇప్పటికే తన అనుచరులతో మంతనాలు జరుపుతున్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లయితే పార్టీ పరంగానే కాకుండా పదవుల పరంగా కూడా భవిష్యత్ ప్రాధాన్యత కల్పిస్తామని అధిష్టానం ఇప్పటికే వీరిద్దరికి సంకేతాలు ఇచ్చినట్లు కూడా చెబుతున్నారు.

● బీజేపీ సైతం..

కాగా భారతీయ జనతాపార్టీ కూడా వేణుగోపాలచారి, సత్యనారాయణ గౌడ్‌లపై దృష్టి కేంద్రీకరించినట్లు చెబుతున్నారు. మొదటి నుంచి వీరిద్దరికి బీజేపీ నేతలతో సన్నిహిత సంబంధాలుండడం, అలాగే వీరిద్దరు జాతీయ భావాలు కలిగి ఉండడంతో బీజేపీ నేతలు ఇప్పటికే రంగంలోకి దిగి వీరిని తమ పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని అంటున్నారు. తమకున్న చనువు కారణంగా ఈ ఇద్దరు నేతలను తమ పార్టీలోకి చేర్చుకోవడం కష్టమేమీ కాదన్న భావనలో ఆ పార్టీ నేతలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. కాగా.. సత్యనారాయణగౌడ్ ఒక అడుగు ముందుకు వేసి బీజేపీలతో ఇప్పటికే సంప్రదింపులు కూడా జరిపారని అంటున్నారు. వేణుగోపాల చారి కూడా బీజేపీ రాష్ట్ర స్థాయి నేతలతో టచ్‌లో ఉన్నారని చెబుతున్నారు. రోజు రోజుకు గ్రాఫ్ పడిపోతున్న కారణంగా వీరిద్దరు ఎట్టి పరిస్థితుల్లో ఆ పార్టీని వీడి బీజేపీలోనే చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. దీనికి అనుగుణంగా ఈ ఇద్దరు నేతలతో జిల్లా, రాష్ట్రస్థాయి నేతలు సైతం మంతనాలు సాగిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి షాక్

● పార్టీకి నిర్మల్ మున్సిపల్ చైర్మన్ రాజీనామా



నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 13 : జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి భారీషాక్ తగిలింది. నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయన పార్టీ అధినేత కేసీఆర్‌కు తన రాజీనామా ఆమోదించాలని లేఖ పంపించారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రాజీనామా చేస్తున్నానని తెలిపారు. తన రాజీనామా ఆమోదించాలని ఆయన కోరారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చైర్మన్ ఈశ్వర్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నేడు నటరాజ్ ఫీడర్‌కు మరమ్మతులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 13 : నటరాజ్ 11 కేవీఫీడర్ మరమ్మతులు ఆదివారం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు నటరాజ్‌నగర్, చైన్‌గేట్, ఇంద్రానగర్, గొల్లపేట, బోయవాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కిరాణా షాపులో చోరీ



చోరీకి గురైన షాపు.. దుండగులు ధ్వంసం చేసిన షెటర్

కుభీర్, ఏప్రిల్ 13 : మండల కేంద్రంలోని బజార్‌గల్లీ ప్రధానరోడ్డు పక్కన గల రఫీక్ కిరాణా అండ్ హోల్‌సేల్ దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు కిరాణాషాపు యజమాని రఫీక్ తెలిపారు. రోజుమాదిరిగా రాత్రి 9.30కు కిరాణాషాపు మూసివేసి ఇంటికి వెళ్లారు. ఉదయం వచ్చి చూసే సరికి కిరాణా షాపుకు వెనుకభాగంలో గల షెటర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి షాపులోకి చొరబడి కౌంటర్‌లో గల రూ. 50వేల నగదుతో పటు రూ. 90వేలు విలువ గల సిగరెట్లు, సబ్బులు, తదితర సామాగ్రిని చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్‌టీం సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా చోరీకి పాల్పడిన వ్యక్తులను త్వరలోనే గుర్తించి పట్టుకుంటామన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



లింబా (కే) గ్రామంలో మృతి చెందిన ఆవు

కుంటాల, ఏప్రిల్, 13 : మండలంలోని లింబా (కే) గ్రామానికి చెందిన వన్నెల బాజన్న అనే రైతుకు చెందిన ఆవు శనివారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో మృతి చెందింది. శనివారం మేతకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనలో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ రూ. 65 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు. ఘటనా స్థలాన్ని విద్యుత్ అధికారులు సందర్శించారు.

ముథోల్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ముథోల్ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

ముథోల్, ఏప్రిల్ 13 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం మండల కేంద్రమైన ముథోల్‌లో పోలీసులు కవాతు నిర్వహించారు. పౌరులు ఎన్నికల నిబంధనలకు లోబడి నడుచుకోవాలని అడిషనల్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడిన, గొడవలు సృష్టించిన అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు మల్లేష్, ఏవీ రావ్, పుండలిక్, ఎస్సై సాయి కిరణ్, సీఆర్పీఎఫ్ 40 మంది, పోలీస్ కానిస్టేబుళ్లు 15 మంది, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో విఫలం'

కుంటాల, ఏప్రిల్, 13 : తెలంగాణ రాష్ట్రంలో గత నాలుగు నెలల నుంచి ప్రభుత్వం నడుపుతున్న కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యురాలు పడకంటి రమాదేవి అన్నారు. శనివారం మండల కేంద్రం కుంటాలలో పార్టీ కార్యకర్తలతో ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపు బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇందుకోసం గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలు నాలుగు నెలల నుండి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమి లేదని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. రైతులకు రుణమాఫీ, చాలా మంది రైతులకు రైతుబంధుతో పాటు రైతులకు వరిపంటకు రూ. 500 బోనస్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రజల్లోకి తీసుకెళుతూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం అహర్నిశలు కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం దౌనెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సయ్యద్ అలీం తల్లి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పడకంటి దత్తు ఉన్నారు.

భక్తాంజనేయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు



భక్తాంజనేయ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 13 : జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో శ్రీ భక్తాంజనేయ అభివృద్ధి నూతన కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. గౌరవ అధ్య క్షుడిగా కూన పెద్దలింగన్న, పాల్దేసునీల్, అధ్యక్షుడిగా మెంగశేఖర్, ప్రధాన కార్య దర్శిగా చాదలరాజన్న, కోశాధికారిగా మూసపల్లి సురేష్ ఎన్నికయ్యారు. కో క్యాషియర్‌గా భూమన్న, ఎలిశెట్టి నారాయణ, ఉపాధ్యక్షులుగా కే. వెంకటరమణ, నల్ల పురుషోత్తం రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా భూమన్నయాదవ్, ఎన్.శ్రీకాంత్ రెడ్డి, ప్రచార కార్యదర్శులుగా ఏ.సంజీవ్‌కుమార్, కందుల శేఖర్, సలహా సభ్యులుగా ఏ. గంగాధర్, మెంగహరీష్, వి.తిరుపతిరావు, కదం నరేష్, సుంకరి శివకుమార్, బి. ప్రభాకర్, జైపాల్, ఇందూరి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

» ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ

ఖానాపూర్, ఏప్రిల్ 13 : ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అనుమతిలేని వెంచర్ల నిర్మాణాలపై చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ అన్నారు. శనివారం ఖానాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై వేస్తున్న వెంచర్లపై అధికారికంగా చర్యలు చేపడతామన్నారు. పాలకవర్గంపై అసత్యపు ప్రచారాలు చేస్తే భయపడేది లేదన్నారు. 11వ వార్డు పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వేసిన వెంచర్‌తో అయ్యప్ప గుడి ముందర ఉన్న ఇళ్లలోకి భారీగా వర్షం నీరు రావడానికి కారణమైందన్నారు. 6వ వార్డు, 7వ వార్డు, 8వ వార్డుల్లో సైతం వెంచర్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించామని వారిపై చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు కిషోర్ నాయక్, కే. శ్రీనివాస్, నాయకులు జన్నారపు శంకర్, పి. సురేష్, తదితరులున్నారు.

అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు ముమ్మర చర్యలు



భైంసా సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది

భైంసా, ఏప్రిల్ 13 : డివిజన్ పరిధిలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించేందుకు గాను ట్రాన్స్‌కో అధికారులు ప్రణాళికబద్ధమైన ముమ్మర చర్యలు చేపడుతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సంబంధిత ప్రాంత ట్రాన్స్‌కో అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇక్కడి ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సబ్ స్టేషన్లకు ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మత్తు చర్యలు చేపడుతున్నారు. సబ్‌స్టేషన్ల నిర్వహణ వ్యవస్థను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఇక్కడి ప్రాంత డీఈ, ఏడీఈ, ఏఈలతో సమన్వయంతో వ్యవహరించుకుంటూ సబ్ స్టేసన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. లైన్లలో లోపాలు ఏర్పడకుండా తరచూ తనిఖీలు చేపడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సమస్యలు ఏర్పడకుండా పరిశీలనలు చేపడుతున్నారు. అంతరాయం లేని సరఫరా అందించే దిశగా ముమ్మరంగా చర్యలు చేపడుతున్నారు. దీంతో ఇక్కడి ప్రాంతంలో గత కొంత కాలంగా అంతరాయం లేని విద్యుత్ సరఫరా కొనసాగుతోంది.

జిల్లాలో అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

- కొనుగోలు కేంద్రాల్లో పాక్షికంగా తడిసిన ధాన్యం
- అకాల వర్షానికి పంటను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు
- పంట కోయని రైతుల గుండెల్లో గుబులు పుట్టించిన వర్షం



వద్దాల్‌లో కల్లంలో పంట దిగుబడులు తడిసిన దృశ్యం



చింతకుంటలో కల్లంలో తడిసిన ధాన్యం

ముథోల్, ఏప్రిల్ 13 : జిల్లాలో శుక్రశనివారాల్లో కురిసిన వర్షం అన్నదాతను ఆందోళనకు గురిచేసింది. కల్లాల్లో పోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జిల్లాలో ఎక్కువ శాతం కోతదశలో ఉన్న పంటకు ఎలాంటి నష్టం జరుగుతుందోనని భయాందోళనకు గురయ్యారు. అయితే జిల్లాలోని ఆయా మండలాల్లో వర్షం కురవడంతో పెద్దగా నష్టం జరగక పోయినప్పటికీ అక్కడక్కడ పాక్షికంగా ధాన్యం తడిసింది. జిల్లాలో యాసంగికి ప్రధానంగా లక్ష పది వేల ఎకరాల వరి పంట సాగు, లక్ష ఐదు వేల ఎకరాల మొక్కజొన్నతో పాటు జొన్న పంట రైతులు సాగు చేశారు. అయితే జిల్లాలోని ముథోల్, నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఆయా ప్రాంతాల్లో సుమారు 70 శాతం మొక్కజొన్న కోత పూర్తికాగా మరో 30 శాతం పంట కోత దశలో ఉంది. అలాగే జిల్లాలో వరి పంట కేవలం ముథోల్ నియోజకవర్గ పరిధిలోని ముథోల్, లోకేశ్వరం మండలాల్లో కొన్ని గ్రామాల్లో కోతకు రాగా జిల్లాలో 95 శాతానికి పైగా వరి పంట కోత దశకు రాలేదు. దీంతో వారం రోజుల క్రితం కురిసిన వర్షం, నిన్న కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, వరి దిగుబడులు తడిసిపోయాయి. అలాగే కురిసిన వర్షానికి పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కురుస్తున్న వర్షానికి రైతు ఉలిక్కి పడుతున్నాడు. వచ్చిన దిగుబడులను కాపాడుకునేందుకు టార్పాలిన్ కవర్లు కప్పి తడవకుండా నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న నేలకు వంగింది. జిల్లాలో ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ జిల్లాలో 95 శాతం వరి పంట కోతకు రాలేదు. మొక్క జొన్న దిగుబడులు వచ్చినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులకు రైతులు విక్రయిస్తున్నారు. ఏది ఏమైనా అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు.

జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలకు నష్టమేమీ జరుగలేదని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ తెలిపారు. పాక్షికంగా దిగుబడులు తడిసి ఉండవచ్చన్నారు. వచ్చిన దిగుబడులను తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పి జాగ్రత్త పడాలన్నారు. దాదాపు మొక్కజొన్న కోత పూర్తయ్యిందన్నారు.

సంక్షిప్త సమాచారం

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరి మృతి




మృతి చెందిన దయాకర్ (ఫైల్)

సారంగాపూర్, ఏప్రిల్ 13 : మండలంలోని ఆలూర్ గ్రామ సమీపంలో శనివారం ట్రాక్టర్ బోల్తా పడి దండ్ల దయాకర్ అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలూర్ నుండి నిర్మల్ వైపు ట్రాక్టర్ వెళ్తుండగా టైర్ పగిలి అదుపు తప్పి పంట పొలాల్లో బోల్తా పడడంతో దయాకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోసం నిర్మల్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 13 : నిర్మల్ పట్టణంలోని గాజులపేట, బంగల్‌పేట్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 నుండి 12 గంటల వరకు మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గాజులపేట, డాక్టర్‌లైన్, కొమ్ము నారాయణ మిల్, బైల్ బజార్, వ్యవసాయ మార్కెట్ ఏరియా, మోచిగల్లీ, బుధవార్ పేట్, గాంధీ చౌక్, కబూతర్ కమాన్, నాయుడివాడ, బోయవాడ, రామారావు బాగ్, తదితర ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్ కారణంగా వడ్యాల్‌లో ఇల్లు దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 13 : మండలంలోని వడ్యాల్ గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇళ్లు దగ్ధమైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ దేవిక తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో నివాసం కలిగి ఉన్న తలారి శ్రీనివాస్ దంపతులు ఇంటికి తాళ్లం వేసి పనుల నిమిత్తం బయటికి వెళ్లారు. ఉన్న ఫలంగా మంటలు చెలరేగి ఇళ్లు తగలబడుతున్న దృశ్యాన్ని సమీప వ్యక్తులు చూసి శ్రీనివాస్‌కు తెలిపారు. ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చి మంటలు ఆర్పారు. ఇంట్లో దాచుకున్న రూ. 50 వేల నగదుతో పాటు, నిత్యావసరాలు, దుస్తులు, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. సంఘటన స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు గుర్తించామన్నారు. మొత్తం మీద 2.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు తెలిపారు.

విద్యార్థినులకు మహిళా భద్రతపై అవగాహన

సారంగాపూర్, ఏప్రిల్ 13 : మండలంలోని చించోలి(బి)లో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు శనివారం మహిళా భద్రతపై షీ టీం అధికారులు రమాదేవి, రాధికలు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ క్రైమ్‌లతో పాటు సోషల్ మీడియాలో మహిళలను ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే 1930 నంబర్‌తో పాటు 100 నంబర్‌కి సమాచారాన్ని అందిస్తే.. నేరాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంఈవో మధు సూదన్, ఉపాధ్యాయులు రమేష్, సాయన్నలతో పాటు విద్యార్థినులు, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దారంతా చెత్తమయం!

● ఇచ్చోడలోని ప్రధాన రహదారిపైనే కోళ్ల వ్యర్థాలు, చెత్తాచెదారం ● రోడ్డుపై నడవాలంటే ముక్కు మూసుకోవాల్సిందే..

ఇచ్చోడ, ఏప్రిల్ 13: ఇచ్చోడ మేజర్ గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని నిర్మల్ వైపు గల బైపాస్ రహదారే డంపింగ్ యార్డుగా మారింది. అటు ఆదిలాబాద్ ఇటు నిర్మల్ వెళ్లాలన్నా ఇదే మార్గం. కానీ ఈమార్గం ఇప్పుడు వ్యర్థాలు, చెత్తా చెదారతో నిండిపోయింది. ఉదయం నడకకు వెళ్లే వారు ఈ వైపు వచ్చారంటే ముక్కుకు బట్ట కట్టుకోవాల్సిందేనని మార్నింగ్ వాక్ సభ్యులు వాపోతున్నారు. ఆ మార్గంలో కుళ్లిపోయిన వ్యర్థాలతో మురికి కూపంగా మారిపోయింది. పేరుకుపోయిన చెత్తతో దుర్గంధభరితంగా తయారైంది. ఊరిమీద చెత్తంతా ఆ రహదారిలోనే చేరుతుంది. ఆ చెత్తలోనే పశువులు, పందులు సంచరిస్తున్నాయి. మండల కేంద్రంలో ఉన్న చికెన్‌సెంటర్ దకాణాల్లోని చికెన్ వ్యర్థాలను సేకరించి.. ఆ రహదారిలోనే వేయడంతో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాం. ఇంతలా పారేస్తున్నారంటే ఆ రహదారే డంపింగ్ యార్డు అనుకోవచ్చు. ఆ రోడ్డు ద్వారానే పంచాయతీ అధికారులు, మండల అధికారులు నిత్యం ప్రయాణిస్తున్న ఆవైపు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.


మురికికూపంగా మారిన ఇచ్చోడ ప్రధాన రహదారి

ఇకనైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి చెత్త, వ్యర్థాలను రహదారిపై కాకుండా డంపింగ్ యార్డులో వేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రధాన రహదారికి పక్కన గుట్టలుగా పేరుకుపోయిన చికెన్ కోళ్ల వ్యర్థాలు


మాట్లాడుతున్న డీఎస్పీ నాగేందర్

కిలో 60 గ్రాముల గంజాయి పట్టివేత

● ఐదుగురి అరెస్టు.. మరొకరి కోసం గాలింపు

ఉట్నూర్, ఏప్రిల్ 13: ఉట్నూర్ ఏజెన్సీలోని ఇంద్రవెల్లి మండలం ముతునూరు గ్రామ సమీపంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకోగా.. వారి సమాచారం మేరకు మరో ముగ్గురిని పట్టుకున్నామని, మరొకరు పరారీలో ఉన్నారని ఉట్నూర్ డివిజనల్ పోలీసు సూపరింటెండెంట్ నాగేందర్ తెలిపారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు ముత్తునూరు సమీపంలో దూంపేట రాకేష్, ముద్దం రాంచరణ్‌లు ఇరువురు జగిత్యాల జిల్లాకు చెందిన వారని, వీరి వద్ద 510 గ్రాముల గంజాయి లభించిందని అన్నారు. వీరికి గంజాయి సరఫరా చేసిన వారు మర్కగూడ సమీపంలో ముత్నూర్‌కు చెందిన మేస్రం శేఖర్, అనోడాకు చెందిన కుంరా రాంజీ, బొప్పపూర్‌కు చెందిన మెస్రం రవీందర్‌ల వద్ద 500 గ్రాముల గంజాయి పట్టుకున్నామన్నారు. తోయగూడకు చెందిన జుగానక భీంరావ్ వద్ద 50 గ్రాములు లభించినప్పటికీ.. అతను తప్పించుకు పోయాడని తెలిపారు. వీరందరి వద్ద నుంచి 1060 గ్రాముల నిషేధిత గంజాయి, ఒక యాక్టివా ద్విచక్ర వాహనము, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఐదుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. యువత డబ్బు సంపాదన కోసం తప్పుదారిలో పయనించడం సరైంది కాదన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసిన, గంజాయి తాగిన తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. సులువుగా డబ్బు సంపాదించాలన్న భావనతో కొంతమంది యువకులు తప్పుతోవ పడుతున్నారని, తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి, ఉట్నూర్, ఇంద్రవెల్లి ఎస్సైలు మనోహర్, దుబ్బాక సునీల్‌లు, తదితరులు పాల్గొన్నారు.

'అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలి'

తలమడుగు, ఏప్రిల్ 13: అర్హులైన ప్రతీఒక్కరు ఈనెల 14లోగా ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. ఏప్రిల్ 1 వరకు 18 ఏళ్లు నిండిన యువత ఫారం 6 నింపి సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలన్నారు. అదే విధంగా ఎస్ఎస్‌సీ మేముతో ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు మే 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు పొందే అవకాశం లభిస్తుందన్నారు. అదే విధంగా పార్లమెంట్ ఎన్నికల కోసం మండలంలో 43 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో 27003 ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఇలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో సీనియర్ అసిస్టెంట్ అజీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు : ఎంపీడీవో

తాంసి, ఏప్రిల్ 13: ఉపాధి పథకం పనుల్లో నాణ్యత లోపం కనిపిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి పథకం సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబు కార్డు ఉన్న ప్రతీఒక్కరికి ఉపాధి పనుల్లో అవకాశం కల్పించాలన్నారు. ప్రతీకూలీకి కనీస వసతులను కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. ముఖ్యంగా ఎండల్లో పని చేయకుండా నీడ పట్టున పని చేసేలా చూడాలన్నారు. తాగునీటి సౌకర్యాన్ని తప్పనిసరిగా కల్పించాలని, వారివారి విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సంగీత, సూపరింటెండెంట్ రవీందర్, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్‌రెడ్డి

ఘనంగా డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, జ్యోతిబా పూలే జయంతి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 13 : నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాత్మజ్యోతి బాపూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జే.భీమ్‌రావు మాట్లాడుతూ... భారతీయ దేశంలో గల భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడటానికి ప్రజల మధ్య సమానత్వం కోసం, అంటరానితన నిర్మూలన కోసం కృషి చేసి, ఈ దేశ ప్రజల మధ్య ఐక్యత కోసం కృషి చేసిన మహనీయులు పూలే, అంబేద్కర్‌ల ఆలోచన విధానాన్ని ప్రతి పౌరుడు గ్రహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సహాయ ఆచార్యులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్, మహాత్మ జ్యోతి బాపూలే జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

16న సీఎం రేవంత్‌రెడ్డితో

గల్ఫ్ సంఘాల ప్రతినిధుల సమావేశం

ఖానాపూర్, ఏప్రిల్ 13 : ఈ నెల 16వ తేదీన హైదరా బాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో గల్ఫ్ సంఘాల ప్రతినిధి సమావేశం నిర్వహించనున్నట్లు టీపీ సీసీ ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ డాక్టర్ బీఎం వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు హైదరా బాద్‌లో శనివారం టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ పార్లమెంట్ ఎన్ని కల కోఆర్డినేటర్ స్వదేశ్ పరికి పండ్లతో నియోజకవర్గాల వారీ గా ఉన్న పరిస్థితిపై సమీక్ష నిర్వహించినట్లు వినోద్ కుమార్ ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టినందున రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గల్ఫ్ కార్మిక కుటుంబాలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతాయన్నారు. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, జహీరాబాద్, మెదక్, వరంగల్ ఎంపీ స్థానాల్లో గల్ఫ్ కార్మికుల ఓటు బ్యాంకు ప్రభావం గణనీయంగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.


పార్లమెంట్ ఎన్నికలపై సమాలోచన చేస్తున్న టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ నాయకులు

చేరికలే కాంగ్రెస్ విజయానికి నాంది : ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 13: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని, వీరి చేరికలు పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయానికి నాంది అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కినక జుగదిరావు, మాజీ సర్పంచ్ గోడం నాగోరావులు ఎమ్మెల్యే, అభ్యర్థి ఆత్రం సుగుణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించి దేశంలో రాహుల్‌గాంధీని ప్రధానిగా చేద్దామని పిలుపునిచ్చారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మాజీ అధ్యక్షుడు సోమోరే నాగోరావు, పట్టణ అధ్యక్షుడు జహర్, మెస్రం నాగనాథ్, తదితరులు ఉన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్: మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కడం మండలంలో నర్సాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కుడిమెత బాజీరావుతో పాటు వార్డు సభ్యులు జాడి జనార్ధన్, రమేష్, రాజన్న, శేఖర్, రాములు, రాజకుమార్‌లు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. శనివారం ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి వారికి కండువా కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు.

ఆదిలాబాద్ అర్బన్: జాఫర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం స్థానిక ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో వార్డు పార్టీలో చేరారు. అదేవిధంగా జైనథ్ మండలం కరంజి మాజీ ఉప సర్పంచ్ బిక్కి పొచ్చన్నతో పాటు పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండ గంగాధర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 13: కేంద్ర ప్రభుత్వ మతోన్మాద ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా భారత రాజ్యాంగ రక్షణకు దేశ ప్రజలందరు సిద్ధమై రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారి రవికుమార్ ప్రజలకు పిలుపినిచ్చారు. శనివారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి పదేళ్లు గడిచాయని, ఈ కాలంలో దేశ ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పని చేయలేదన్నారు. ఇందులో బండారు రవికుమార్, దర్శనాల మల్లేష్, లంక రాఘవులు, ము డుపు ప్రభాకర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, వి.ప్రభాకర్, నంది రామయ్య, జగన్ సింగ్, జె.రాజు, బి.వెంకట్ నారాయణ, బొజ్జ ఆశన్న, మంజుల, స్వామి, గణేష్, కళావతి గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ : ఏఐటీయూసీ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 13: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీకి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి కార్మిక లోకం సిద్ధమైందని ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. శనివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదేళ్ల కాలంలో బీజేపీ కార్మికులకు చేసిన అన్యాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ పదేళ్ల కాలంలో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని తెలిపారు. కార్మికులకు అనుకూలంగా ఉన్న 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు మేలు చేశారని మండిపడ్డారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా ఉన్న కార్మికులు బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో ఉన్నారని తెలిపారు. ఇందులో సిర్ర దేవేందర్, గాజేంగులరాజు, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం హామీ'


బోథ్, ఏప్రిల్ 13: గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఇస్తామన్న హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు హామీ ఇవ్వడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తుల అరుణ్‌కుమార్ తెలిపారు. వంద రోజుల్లోపు ఇచ్చిన హామీ ప్రకారం తనతో పాటు వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వారి నివాసంలో కలవడం జరిగిందన్నారు.

'కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు'

బోథ్, ఏప్రిల్ 13: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి పని చేయాలని, అభ్యర్థి గెలుపు కోసం కష్టపడ్డ వారందరికీ భవిష్యత్తు ఉంటుందని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడె గజేందర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని షాదీఖానాలో బోథ్ కమిటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చడం జరుగుతుందన్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభుత్వం అమలుపరిచిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పలు గ్రామాల పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సిరిపెల్లి శివారులో నగదు పట్టివేత

కుభీర్, ఏప్రిల్ 13 : మండలంలోని సిరిపెల్లి గ్రామ శివారులోని చెక్‌పోస్టు వద్ద శనివారం రూ. 80వేల నగదును పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. వివరాల ప్రకారం... ఎన్నికల కోడ్ నేపథ్యంలో తనిఖీలు చేస్తుండగా జలాల్ అనే వ్యక్తి ఎలాంటి పత్రాలు లేకుండా భైంసా నుంచి పాలాజ్‌కు రూ. 80వేలు తరలిస్తుండడంతో పట్టుకోవడం జరిగిందన్నారు.





పోటాపోటీగా.. ప్రచారం!

- జిల్లాలో లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన ప్రధాన పార్టీల అభ్యరులు
- పాత పథకాలనే మళ్లీ డబ్బా కొడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ
- ఆరు గ్యారంటీలు, అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్న కాంగ్రెస్
- చెప్పుకునేది లేక మోదీ భజన చేస్తున్న కమలం పార్టీ
- రాజకీయ నేతల ప్రసంగాలతో విసిగెత్తిపోతున్న జనం



ఆదిలాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రధాన పార్టీలు పోటాపోటీ ప్రచారానికి దిగుతున్నాయి. అయితే రాజకీయ నేతల ప్రసంగాలలో ఏ మాత్రం పసలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నేతలు ఇచ్చిన హామీలే మళ్లీ పార్లమెంటు ఎన్నికల్లోనూ పునరావృతం చేస్తున్నారు. వరుస ఎన్నికలు రావడంతో చెప్పిందే చెప్పడం ప్రధాన పార్టీల అభ్యర్థులకు పరిపాటిగా మారింది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు దిక్కులేదు కానీ, మళ్లీ కొత్తగా హామీలనిస్తూ ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. బీఆర్‌ఎస్, అధికార కాంగ్రెస్ పార్టీలు గతంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను గుర్తు చేస్తు తెరపైకి తెస్తుండగా బీజెపి మాత్రం జాతీయ అంశాలనే ప్రస్తావిస్తూ ప్రచారానికి దిగుతున్నాయి. స్థానిక సమస్యలతో సతమతమవుతున్న ఓటర్లు జాతీయ అంశాల పై అంతగా ఆసక్తి చూపినట్లు కనిపించడం లేదు. ప్రధానంగా ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్, సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, ఎరోడ్రమ్, గిరిజన యూనివర్సిటీ, కేంద్రీయ విశ్వ విద్యాలయం, కుప్టి బ్యారేజి నిర్మాణం లాంటి సమస్యల ప్రస్తావనపై ఊసేత్తడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలే జనం మధ్యలో కనిపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో పెద్దగా చెప్పుకునేందుకు పథకాలేమీ లేకపోవడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎక్కడికి వెళ్లినా ఇచ్చిన ప్రసంగాలనే మళ్లీ మళ్లీ ఇవ్వడం గమనార్హం. అలాగే డమ్మీ హామీలతో ఓటర్ల మద్ధతుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అభ్యర్థులు లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కొత్త అంశాల జోలికి వెళ్లకపోవడంతో జనాలు విసిగెత్తిపోతున్నారు.

పాత పథకాలే ప్రచారాస్త్రాలుగా..

అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్‌సభ ఎన్నికల్లోను బీఆర్‌ఎస్ పార్టీకి పాత పథకాలే ప్రచారాస్త్రాలుగా మారుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధే తమను గెలిపిస్తుందని బీఆర్‌ఎస్ గట్టిగా నమ్ముతుంది. ముఖ్యంగా ఆసరా పింఛన్, రైతు బంధు, రైతుబీమా, మిషన్ భగీరథ పథకాలను మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. వెనుకబడిన జిల్లా అభివృద్ధిపై నేతలు నోరుమెదుపడం లేదు. శాశ్వత పరిష్కార మార్గాలు, నిరుద్యోగ నిర్మూలన, భారీ పరిశ్రమల ఏర్పాటు లాంటి అంశాల జోలికి పోవడం లేదు. అలాగే జిల్లాలో గత ఆరేడేళ్లుగా రగిలిపోతున్న ఆదివాసీ, లంబాడాల ఉద్యమానికి పరిష్కార మార్గం చూపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆసక్తి చూపడం లేదంటున్నారు. కేవలం తమ పార్టీతోనే ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి సాధ్యమంటూ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. రెండు తెగల మధ్య తలెత్తిన విభేదాల పరిష్కారానికి ఏపార్టీ నేతలు స్పష్టమైన హామీ ఇవ్వడం లేదు. ఎన్నో ఏళ్లుగా పరిష్కా రానికి నోచుకోని సమస్యలను గాలికి వదిలేయడంపై జిల్లావాసులు మండిపడుతున్నారు. ఈసారైనా జిల్లా దీర్ఘకాలిక సమస్యలపై ప్రధాన పార్టీలకు చిత్తశుద్ధి ఉన్నట్లు కనిపించడం లేదు.

విమర్శలకు పదును..

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసే దిశగా అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే కొన్ని గ్యారంటీలను మొదలు పెట్టినా.. ఎన్నికల తర్వాత పూర్తిస్థాయిలో అమలు చేస్తామని కాంగ్రెస్ నేతలు హామీలిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ఆపరేషన్ ఆకర్ష్‌తో బలపడేందుకు ప్రయత్నాలు చేస్తోంది. రాహుల్‌ను ప్రధాని చేయాలంటూ ఎన్నికల ప్రచారంలో ముందుకెళ్తోంది. సోనియాగాంధీ త్యాగాల వల్లనే తెలంగాణ వచ్చిందని పదేపదే చెప్పే ప్రయత్నం చేస్తోంది. అధిష్టానం కొత్తగా ప్రకటించిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ కూడా జిల్లా సమస్యలపై పెద్దగా ఫోకస్ పెట్టినట్లు కనిపించడం లేదు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలపై ఆరోపణలు చేసేందుకే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నట్లు కనిపిస్తుంది. పదేపదే ప్రతిపక్షాలపై దుమ్మెత్తి పోసే కన్నా.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేసేదేమిటో సూటిగా చెప్పాలని ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రచారమంతా ఆరు గ్యారంటీల చుట్టే తిరుగుతున్నట్లు కనిపిస్తోంది. జిల్లాలోని ప్రధాన సమస్యలపై అసలు పట్టింపు లేకుండా పోయిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

మళ్లీ గెలిచేందుకు ఆరాటం

2019 ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని తన ఖాతాల్లో వేసుకున్న బీజేపీ.. మళ్లీ గెలిచేందుకు ఆరాట పడుతోంది. మోదీ ఈమేజ్‌తో ప్రచారాన్ని చేపడుతోంది. గడిచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పెద్దగా లేకపోవడంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భజనతోనే ఎన్నికల ప్రచారాన్ని చుట్టేస్తోంది. ముఖ్యంగా యువతలో ప్రధానిమోదీపై ఉన్న ఇమేజ్‌ను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కమలం పార్టీ ప్రయత్నం చేస్తోంది. ఎన్నో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలవుతున్నా.. ప్రజల్లో వాటికి అంతంతమాత్రంగానే ఆదరణ కనిపిస్తోంది. సుస్థిర పాలన కోసం బీజేపీకి మద్దతుగా నిలవాలని చెబుతూనే.. జాతీయ, హిందుత్వ అంశాలను తెరపైకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీని పక్కన పెట్టి.. కొత్త అభ్యర్థికి అవకాశం ఇవ్వడంతో అభివృద్ధి పనుల జోలికి అసలు వెళ్లినట్లే కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికలు కావడంతో మొత్తం ఢిల్లీ చుట్టే గల్లీ రాజకీయం కనిపిస్తోంది. ఔర్ ఏక్ బార్ మోదీ అనే నినాదంతో బీజేపీ ప్రజల్లోకి వెళ్తోంది. జాతీయస్థాయి రాజకీయ పరిణామాలను గల్లీ ప్రచారంలో ప్రస్తావించడంతో అమాయక జనం అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు. అయితే స్థానిక సమస్యల పరిష్కారానికి పక్కా హామీ ఇచ్చిన పార్టీకే ఈసారి మద్దతుగా నిలుస్తామని ఓటర్లు బహిరంగంగానే చెబుతున్నారు.



నగదును పట్టుకున్న ఎఫ్‌ఎస్‌టీ టీం అధికారులు

ఫౌజ్‌పూర్ వద్ద రూ.2లక్షల 50వేల నగదు పట్టివేత

జైనథ్ రూరల్, ఏప్రిల్ 13: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం జైనథ్ మండలంలోని ఫౌజ్‌పూర్ దగ్గర పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రకు చెందిన బస్సు(ఎంహెచ్40 ఎన్ 9379)ను ఎఫ్‌ఎస్‌టీ టీం అధికారి టి.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. చంద్రపూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న ఆ బస్సులో ఉన్న కర్మకర్ చందు అనే ప్రయాణికుని బ్యాగులో రూ.2లక్షల 50వేలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. డబ్బుకు సంబంధించిన ఎలాంటి ఆదారాలు లేకపోవడంతో కర్మకర్ చందుపై కేసు నమోదు చేశారు. ఈ నగదును జిల్లా ట్రెజరీ ఖాతాలో జమ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి టి.శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ గణేష్, హోంగార్డ్ కిష్టన్న, వీడియోగ్రాఫర్ చంద్రశేఖర్ ఎఫ్‌ఎస్‌టీ టీం కార్ డ్రైవర్ మహ్మద్ జహీర్, తదితరులు పాల్గొన్నారు.



వెలవెలబోతున్న మత్తడివాగు ప్రాజెక్టు

ఎడారిని తలపిస్తున్న మత్తడివాగు ప్రాజెక్టు

- రోజురోజుకూ అడుగంటిపోతున్న నీటిమట్టం
- ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా.. ప్రస్తుతం 271.10 మీటర్లు

తాంసి, ఏప్రిల్ 13: మండలంలోని వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న మత్తడి వాగు ప్రాజెక్టు ఎడారిని తలపిస్తుంది. మొన్నటి వరకు నిండుకుండలా కనిపించిన మత్తడివాగు ప్రాజెక్టు ప్రస్తుతం నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. వేసవి ఆరంభంలోనే ఇలా ఉంటే రానున్న మరో మూడు నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 271.10కి చేరుకుంది. గత 20 రోజుల క్రితం నిండుకుండలా కనిపించిన మత్తడివాగు ప్రాజెక్టు ప్రస్తుతం ఎడారిగా కనిపిస్తోంది. ప్రస్తుతం అక్కడ పశువులు మేస్తున్నాయి. ప్రాజెక్టులో అక్కడక్కడ మాత్రం కొద్దిపాటి నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి నీరు రావడం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ప్రాజెక్టు కింద రబీ పంటలు సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ పంటల చివరి వరకు నీరు అందుతుందో? లేదో? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం



అక్షయ్ మృతదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎస్పీ

'సిబ్బందిని కోల్పోవడం బాధాకరం'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 13: జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై నిజామాబాద్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు గుండెపోటుతో మృతి చెందిన భానోత్ అక్షయ్ కుటుంబ సభ్యులను ఎస్పీ గౌస్‌ఆలం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందిని కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. కొడుకుని కోల్పోయిన బాధ తల్లికి మాత్రమే తెలుస్తుందన్నారు. ప్రభుత్వ పరంగా వచ్చే లబ్ధిని త్వరగా చేకూరేలా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లును ఆదేశించారు. తక్షణ సహాయం కింద రూ.20వేలను అందజేశారు. ఇందులో రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నవీన్, పోలీసు కార్యాలయ సిబ్బంది, నార్నూర్ సర్పంచ్ గజానన్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నూతన బ్యాచ్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 13: టీఎస్ ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్ ఈ నెల15 నుంచి శిక్షన ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు హెవీ మోటార్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి ఆదిలాబాద్ డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం 30రోజులు ఉంటుందని, దీనికి ఫీజు రూ.15600 ఉంటుందని ఆసక్తి గల అభ్యర్థులు తప్పనిసరిగా లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాచ్ నెంబర్ కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు ఆదిలాబాద్ డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్ యూసుఫ్ 7382840349 ద్వారా సంప్రదించాలని సూచించారు.

'నిర్ణీత సమయానికి రావాలి'

నేరడిగొండ, ఏప్రిల్ 13: ఆదివారం రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమానికి పార్టీ శ్రేణులు నిర్ణీత సమయానికి రావాలని బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్ అన్నారు. మండలకేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి వేడుకలను స్థానిక భూమారెడ్డి కాంప్లెక్స్ మీద నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పార్టీ సమావేశం కూడా ఉంటుందని తెలిపారు. పార్టీ మండల శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, పోలింగ్ బూత్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి నాయకులు, అందరూ ఉదయం 10గంటల నిర్ణీత సమయానికి హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు

- జిల్లాలో అనుమతి లేకుండా బట్టీలలో తెలకల్లు విక్రయాలు
- ఐదుగురిపై కేసు నమోదు
- పలుచోట్ల కల్లు ప్యాకెట్ల ధ్వంసం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తలమడుగు, ఏప్రిల్ 13: జిల్లాలో అనుమతి లేకుండా అక్రమంగా జోరుగా కల్తీ కల్లు దందా నిర్వహిస్తున్నారని శనివారం ఆదిలాబాద్ జిల్లా 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురణ కావడంతో అధికారులు స్పందించారు. ఎక్సైజ్ శాఖ సీఐ విజయేందర్ అనుమతి లేకుండా విక్రయిస్తున్న కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించి అక్రమంగా నిర్వహించిన తెల్లకల్లు ప్యాకెట్లను ధ్వంసం చేసి జిల్లాలో అయిదుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ తెలిపారు. తలమడుగు మండలం ఝురి, ఉమ్మరి, కుచ్లాపూర్,ఆదిలాబాద్ మండలం తంతోలి, లోహారి గ్రామంలో ఇలాంటి అనుమతులు లేకుండా తెల్ల కల్లు విక్రయించడంతో వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా కల్తీ మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి ఇలాంటి అనుమతులు లేకుండా తెల్లకల్లుని విక్రయిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు.



తెల్లకల్లు ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు





ఆయా గ్రామాల్లో అనుమతులు లేకుండా తెల్లకల్లు విక్రయిస్తున్న వారిని పట్టుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు


ఆంధ్రజ్యోతి
ఆదిలాబాద్
జోరుగా కల్తీ కల్లు.. దందా


'ఆంధ్రజ్యోతి'లో ప్రచురణమైన కథనం

దేశ అభ్యున్నతికి మోదీ విశేష కృషి

- బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు

మావల, ఏప్రిల్ 13: దేశ అభ్యున్నతి కోసం ప్రధానమంత్రి మోదీ విశేష కృషి చేస్తున్నారని బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు పేర్కొన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో పార్లమెంట్ పోలింగ్ బూత్ ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ నాయకులు పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందించిందని.. కానీ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆఅ పథకాలను తమవిగా చెప్పుకుందన్నారు. నేడు గ్రామాల్లోని రైతు వేదికలు, వైకుంఠధామాలు కేంద్ర నిధుల తోనే నిర్మాణమయ్యారన్నారు. బీజేపీ ప్రవేశపెట్టిన కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ 8 స్థానాలు గెలిస్తే అత్యధికంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 4 స్థానాలు గెలుపొందిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో బీజేపీ పార్టీ పటిష్ఠంగా ఉందన్నారు. రేపు జరగబోయే ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ మేరకు కార్యకర్తలనుద్దేశించి దిశా నిర్దేశం చేశారు.





అభివాదం చేస్తున్న పార్టీ నాయకులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న మురళీధర్‌రావు)

- కాంగ్రెస్ గెలిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా : ఏలేటి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో 14 ఎంపీ స్థానాలను గెలుస్తామని ధీమా వ్యక్తంచేస్తున్నారని, ఆ పార్టీ ఒక వేళ వారు అనుకున్నంత 14 స్థానాల్లో గెలిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వారు అనుకున్నంత స్థానాల్లో గెలువకపోతే ఆయన రాజకీయం నుంచి తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అవినీతి, అక్రమాలు, భూ కబ్జాలపై ఉన్న శ్రద్ధ ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై లేదని ఘాటుగా విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అక్రమాలపై ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరిన ఆయన నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. గత నాలుగు నెలల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాల నిర్వాహకులకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, కాంట్రాక్టర్‌లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎలాంటి అవినీతి, అక్రమాలు లేకుండా పరిపాలన కొనసాగిస్తున్న ప్రధాని నరేంద్రమోదీని మరోసారి దేశ ప్రధాని చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు.

- సమావేశానికి ఎంపీ సోయం డుమ్మా

ఎంపీ సోయం బాపూరావు సమావేశానికి డుమ్మా కొట్టారు. పార్లమెంట్ పోలింగ్ బూత్ ఎన్నికల సమావేశానికి జాతీయ నాయకులు, ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు పాల్గొనగా ఎంపీ సోయం బాపూరావు గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, సిర్పూర్ పాల్వాయి హరీష్ మాజీ జడ్పీ చైర్మన్‌లు జనార్ధన్ రాథోడ్, చిట్యాల సుహాసినిరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ కరెన్సీపై విద్యార్థులకు అవగాహన

బోథ్, ఏప్రిల్ 13: మండలంలోని సాకేర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ జిల్లా కార్యదర్శి బాశెట్టి రాజ్‌కుమార్ విద్యార్థులకు 40 దేశాల వివిధ రకాల కరెన్సీపై అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా వివిధ దేశాల్లో వినియోగంలో కరెన్సీని నోట్లను, కాయిన్స్‌లు విద్యార్థులకు ఆయన పరిచయం చేశారు. అంతేకాకుండా వివిధ దేశాల కరెన్సీని ఏ పేరుతో పిలుస్తారని వివరంగా విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్.అనూష, జి.కమలాకర్, సామాజిక కార్యకర్త శ్రీరామ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విదేశీ కరెన్సీపై అవగాహన కల్పిస్తున్న మానవ హక్కుల ఆర్గనైజేషన్ కార్యదర్శి